నిరుపయోగం.. ఎన్నాళ్లు..!

- ఆరిలోవ ప్రాంతంలో అక్కరకు రాని ప్రభుత్వ భవనాలు
- కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

తూర్పు నియోజకవర్గం, జీవీఎంసీ జోన్–2 పరిధిలో ప్రజాధనంతో నిర్మించిన పలు భవనాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. రూ.కోట్ల నిధులతో నిర్మించిన భవనాలను అధికారులు వినియోగంలోకి తీసుకురావడంపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. ప్రజావసరాలు కోసం చేపట్టిన పలు నిర్మాణాలు కొన్ని ఏళ్ల తరబడి దిష్టిబొమ్మలుగా మిగిలిపోయాయి. రూ.కోట్ల నిధులు ప్రజాధనం ఖర్చు చేసి దుర్వినియోగం చేస్తున్నారని అధికారులు, ప్రజా ప్రతినిధులపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. కళ్ల ముందు అభివృద్ధి ఫలాలు కనిపిస్తున్నా అనుభవించే అవకాశం లేకుండా పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – ఆరిలోవ

షాపింగ్ కాంపెక్స్.. ప్రారంభోత్సవానికి ఎదురుచూపులు

జీవీఎంసీ 13వ వార్డు పరిధి ఆరిలోవ కాలనీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం ఎదురుగా గెడ్డ అంచున జీవీఎంసీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి సుమారు ఏడేళ్లు గడిచింది. సుమారు రూ.45 లక్షల నిధులతో 42 షాపులు నిర్మించారు. ఇక్కడ కూరగాయలు, చికెన్, మటన్ షాపులతో పాటు చేపల బజారుకు సంబంధించిన వ్యాపారులు కూడా షాపులు నిర్వహించుకోవచ్చని అప్పట్లో జీవీఎంసీ అధికారులు ప్రకటించారు. ఈ షాపులు నిర్మాణం పూర్తయి ఏడేళ్లు గడిచిపోయింది. ఇంతవరకు అధికారులు వాటిని వ్యాపారులకు కేటాయించలేదు. దీంతో నిరుపయోగంగా మారిన ఈ షాపులను కొందరు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకున్నారు. సమీపంలోనే మద్యం దుకాణం ఉండడంతో మందుబాబులు దీన్ని ఓపెన్ బార్‌గా మార్చేశారు. మరికొందరు రాత్రి వేళ జూదం, అసాంఘిక కార్యకలాపాలకు ఉపయోగించుకుంటున్నారు.


ఆరిలోవ కాలనీలో నిరుపయోగంగా షాపింగ్ కాంప్లెక్స్

సిటీ డయాగ్నోస్టిక్ సెంటర్.. అందుబాటులోకి ఎప్పుడు?

విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్) ఆవరణలో సెంట్రల్ డ్రగ్స్ స్టోర్స్ అండ్ సిటీ డయాగ్నోస్టిక్ సెంటర్ నిర్మాణం పూర్తయింది. అయినా అందుబాటులోకి మాత్రం రాలేదు. ఈ సెంటర్ నిర్మాణాన్ని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అధికారులు రూ.20 కోట్లతో ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. ఇది ప్రారంభమైతే నగరంలో పేద, మధ్య తరగతి రోగులకు ఉచితంగా రక్త పరీక్షలు, స్కానింగ్‌లు ఇక్కడ అందుబాటులోకి రానున్నాయి. దీంతో పాటు ఐదు జిల్లాలకు సంబంధించిన ప్రభుత్వ ఆస్పత్రులకు అవసరమైన మందులన్నీ ఇక్కడ నిల్వ చేయనున్నారు. విమ్స్ ఆవరణలో సుమారు అరెకరం స్థలాన్ని దీని కోసం 2021లో కేటాయించి నిర్మాణం చేపట్టారు. త్వరగా వినియోగంలోకి తీసుకురావాలని అప్పట్లో అధికారులు ప్రాణాళిక సిద్ధం చేశారు. 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మిగిలిన పనులు చేపట్టడానికి సుమారు పది నెలలకుపైగా సాగదీశారు. ఇప్పుడు భవనం సిద్ధంగా ఉన్నప్పటికీ ప్రారంభించకుండా నిరుపయోగంగా వదిలేశారు. పేదలకు ఎంతో ఉపయోగకరమైన ఈ సెంటర్‌ను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.


విమ్స్ ఆవరణలో నిర్మించిన సిటీ డయాగ్నోస్టిక్ సెంటర్


ముడసర్లోవ వద్ద నిర్మించిన జీవీఎంసీ నర్సరీ

మందకొడిగా నర్సరీ పనులు

ముడసర్లోవ రిజర్వాయరు వెనక జీవీఎంసీ సుమారు రెండేళ్ల క్రితం నర్సరీ నిర్మాణం చేపట్టింది. గతంలో బీఆర్‌టీఎస్‌ను ఆనుకుని దీన్‌దయాల్‌పురం వద్ద ఈ నర్సరీ ఉండేది. దీనిలో వివిధ రకాల మొక్కలను ఉత్పత్తి చేసేవారు. రోడ్ల డివైడర్లు, రోడ్ల పక్కన నాటడానికి జీవీఎంసీ ఉద్యాన వనశాఖ అధికారులు మొక్కలను ఇక్కడ నుంచే పంపిణీ చేస్తుండేవారు. ఈ నర్సరీ స్థలంలో ప్రస్తుతం జీవీఎంసీ పిల్లల పార్కు నిర్మిస్తోంది. దీంతో ఇక్కడ నర్సరీ మూతపడింది. ఈ నర్సరీని జీవీఎంసీ అధికారులు ముడసర్లోవ రిజర్వాయరు వెనుక నిర్మాణం చేపడుతున్నారు. ఇక్కడ జీవీఎంసీకి చెందిన విశాలమైన స్థలంలో చుట్టూ గోడలు, ముఖ ద్వారం నిర్మాణం చేపట్టారు. ప్రహరీ నిర్మాణం పనులు పూర్తయినా ఇంతవరకు ఇక్కడ నర్సరీ అందుబాటులోకి తీసుకురాకుండా వదిలేశారు. ప్రస్తుతం కొత్త మొక్కల పెంపకం మూలకు చేరింది.

నెరవేరని రైతుబజార్ కల

జీవీఎంసీ 10వ వార్డు తోటగరువులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెనుక బీఆర్‌టీఎస్‌ను ఆనుకుని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సుమారు అరెకరం స్థలంలో రైతుబజార్ నిర్మాణం చేపట్టారు. దీని కోసం మార్కెటింగ్ శాఖ రూ.80 లక్షలు మంజూరు చేసింది. ఆరిలోవ ప్రాంతం ప్రజల ఎన్నో ఏళ్ల కల ఈ రైతుబజార్. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి దీని నిర్మాణ పనులు సాగుతున్నాయి. గత ప్రభుత్వంలోనే ఇక్కడ రైతులు, డ్వాక్రా మహిళలు కూరగాయలు, ఆకు కూరలు విక్రయించడానికి 38 షాపులు, వ్యాపారుల కోసం 5 కిరాణ షాపులతో పాటు ఈవో కార్యాలయం, స్టోర్ రూం, వాచ్‌మన్ గది, పురుషులు, స్త్రీలకు వేర్వేరుగా మరుగుదొడ్లు, ఆర్వో ప్లాంట్ కోసం ప్రత్యేక గది నిర్మించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ఇంతవరకు దీన్ని వినియోగంలోకి తీసుకురాకుండా వదిలేశారు. దీని ప్రారంభం కోసం స్థానికులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు.


తోటగరువు హైస్కూల్ వెనుక నిర్మించిన రైతుబజార్

వెక్కిరిస్తున్న జోనల్ కార్యాలయం

ముడసర్లోవ వద్ద దీన్‌దయాల్‌పురం ఎదురుగా జీవీఎంసీ సుమారు 12 సంవత్సరాల క్రితం జోన్–2 కార్యాలయం నిర్మించింది. ఇక్కడ బీఆర్‌టీఎస్ పక్కన జీవీఎంసీకి చెందిన 2 ఎకరాల విస్తీర్ణంలో 2011లో దీని నిర్మాణం చేపట్టారు. ఇందు కోసం రూ.6 కోట్ల నిధులు వెచ్చించారు. 2013 నాటికి మూడు అంతస్తుల్లో విశాలమైన గదులతో భవన నిర్మాణం పూర్తి చేశారు. మధురవాడలో ఉన్న జీవీఎంసీ జోన్–2 కార్యాలయాన్ని ఇక్కడికి తరలించడానికి సన్నాహాలు చేశారు. అప్పట్లో ఆ ప్రాంతానికి చెందిన ప్రజా ప్రతినిధులు అడ్డుకోవడంతో జీవీఎంసీ అధికారులు జోనల్ కార్యాలయం ప్రయత్నం విరమించుకోవాల్సి వచ్చింది. అప్పటి టీడీపీ ప్రభుత్వం 2014లో కొద్ది నెలల పాటు దీని ఆవరణాన్ని ప్రభుత్వ ఇసుక యార్డుగా మార్చేసింది. అనంతరం 2015లో హెచ్‌పీసీఎల్ యాజమాన్యానికి స్కిల్ డెవెల్‌మెంట్ సెంటర్ నిర్వహణ కోసం జీవీఎంసీ అధికారులు లీజుకు ఇచ్చేశారు. దీనిపై అప్పట్లో జీవీఎంసీ అధికారులపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. లీజు గడువు తీరిన తర్వాత 2023 నవంబరులో హెచ్‌సీపీఎల్ యాజమాన్యం ఆ భవనాన్ని ఖాళీ చేసి జీవీఎంసీ అధికారులకు అప్పగించేసింది. అప్పటి నుంచి ఏడాదిన్నరగా ఈ భవనం ఖాళీగా ఉంది. పలు భాగాలు శిథిలావస్థకు చేరాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం విలువైన ఈ భవనాన్ని వినియోగించుకోకుండా ఖాళీగా వదిలేసింది. గోడలు పెచ్చులు ఊడిపోయాయి. కిటికీల అద్దాలు పగిలిపోయాయి. వర్షాలు పడుతున్నప్పుడు శ్లాబుల నుంచి నీరు గదుల్లోకి చేరి నిలిచిపోతోంది. మరోవైపు ఈ భవనం నివాసాలకు దూరంగా ఉండడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న ఈ భవనానికి నలుగురు సెక్యూరిటీ సిబ్బందిని నెలకు సుమారు రూ.60 వేలు వరకు వేతనాలు చెల్లిస్తూ కాపలాగా నియమించారు.


ముడసర్లోవ వద్ద నిర్మించిన జోనల్ కార్యాలయం

క్లుప్తంగా

ఘనంగా ముత్యాలమ్మ పండగ


అమ్మవారిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ దుర్గారావు

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డు పందిమెట్టలో కొలువుదీరిన ముత్యాలమ్మ అమ్మవారి పండగ మంగళవారం ఘనంగా జరిగింది. అమ్మవారిని వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ పల్లా దుర్గారావు, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిపై కేసు

ఎంవీపీ కాలనీ: విద్యుదాఘాతానికి గురై మారికవలసకు చెందిన ఉప్పల సత్యజగన్నాథరావు(40) మృతి చెందిన ఘటనపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. సత్యజగన్నాథరావు ఎంవీపీ కాలనీలోని సీఎంఆర్ కార్లాన్‌లో పని చేస్తున్నాడు. ఈ నెల 9న యథావిధిగా ఆయన విధులకు హాజరయ్యాడు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో సత్యజగన్నాథరావు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే ఆయన్ను కేజీహెచ్‌కు తరలించి, విషయాన్ని ఆయన భార్య సునీతకు గ్రైయిన్డర్ కాంట్రాక్టర్ వెంకట్ అప్పారావు ఫోన్ చేసి చెప్పారు. ఆమె కేజీహెచ్‌కు వెళ్లి చూడగా అప్పటికే జగన్నాథరావు మరణించి ఉన్నాడు. ఈ నేపథ్యంలో తన భర్త మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ ఆమె ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

యోగాంధ్రకు కృష్ణా కళాశాల విద్యార్థుల సన్నద్ధం

మద్దిలపాలెం: విశాఖ బీచ్ వేదికగా ఈ నెల 21న ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న యోగాంధ్రలో పాల్గొనేందుకు మద్దిలపాలెంలోని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. దీనిలో భాగంగా మంగళవారం కళాశాల ప్రాంగణంలో యోగాసనాలు వేశారు.

పదవీ విరమణ వయస్సు పెంచాలని వినతి

మద్దిలపాలెం: రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో 15 నుంచి 20 సంవత్సరాలుగా పని చేస్తున్న ఒప్పంద అధ్యాపకుల సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్(కాంట్రాక్ట్) రాష్ట్ర అధ్యక్షుడు కోడి అర్జునుడు కోరారు. ఈ మేరకు మంత్రి లోకేష్‌ను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఒప్పంద అధ్యాపకులకు ఉద్యోగ భద్రతతో పాటు డీఏ, హెచ్‌ఆర్‌ఏతో కూడిన టైం స్కేల్‌ను అమలు చేయాలన్నారు. పదవీ విరమణ వయస్సును 65 ఏళ్లకు పెంచాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని అర్జునుడు తెలిపారు.

'లోకేష్.. హిందువుల ఆచారాలు తెలియవా?'


మాట్లాడుతున్న బీవీ రామ్

ఎంవీపీ కాలనీ: మంత్రి నారా లోకేష్ హిందువుల ఆచారాలను మంటగలిపారని తెలుగు శక్తి అధ్యక్షుడు బీవీ రామ్ ఆరోపించారు. మంగళవారం పాత వెంకోజీపాలెంలోని శివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మంగళవారం రోజు మృతుల కుటుంబ సభ్యుల పరామర్శకు వెళ్లకూడదనే ఆచారం హిందు సంప్రదాయంలో ఉందన్నారు. దాన్ని తుంగలోకి తొక్కి ఇటీవల మరణించిన పల్లా సింహాచలం ఇంటికి లోకేష్ పరామర్శకు వెళ్లడం దారుణమన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: కైలాసగిరి ఫీడర్–11 కేవీ పరిధిలో విద్యుత్ నిర్వహణ పనులు జరగనుండడంతో బుధవారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఈ సందర్భంగా ఫీడర్ నిర్వహణతో పాటు రోడ్ల పక్కన చెట్ల కొమ్మలు తొలగింపు పనులు చేపడతామని ఏపీఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ ఆపరేషన్ పోలాకి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, కైలాసగిరి రోడ్డు, హనుమంతవాక, తోటగరువు, బీఎస్‌ఆర్ నగర్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వైభవంగా కనకమాంబ వార్షిక పండగ


కనకమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి, శ్రీనివాస్ దంపతులు, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, లక్ష్మీ దంపతులు

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డు ఇసుకతోటలో కొలువుదీరిన శ్రీకనకమాంబ వార్షిక పండగ మంగళవారం వైభవంగా జరిగింది. విశేష అలంకరణలో కొలువుదీరిన కనకమాంబ, శ్రీనెల్లి పోలమాంబ, శ్రీఎర్నిమాంబ అమ్మవార్ల దర్శనానికి భక్తులు బారులు తీరారు. సాయంత్రం అనుపు మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు, కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, మాజీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి, శ్రీనివాస్ దంపతులకు శ్రీకృష్ణా ఉమా మహేశ్వర సాయి దుర్గా యాదవ సేవా సంక్షేమ సంఘం కమిటీ గౌరవ అధ్యక్షుడు గొలగాని అప్పారావు, బొట్ట శివ, ఈగల సత్యం, అధ్యక్షుడు ఒమ్మి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు పల్ల అప్పారావు, ప్రసాది అప్పారావు, ప్రధాన కార్యదర్శి ఒమ్మి గోపీకృష్ణ ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయా దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్యూలైన్లు, బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఉదయం 4 గంటల నుంచి అమ్మవారికి పంచామృతాభిషేకాలు, కుంకుమార్చన, సాయంత్రం 4 గంటలకు అమ్మవారి అనుపోత్సవం జరిపారు. ఊరేగింపులో సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ వేడుకలను కోశాధికారి గొలగాని అప్పలరాజు, సహాయ కార్యదర్శి గొలగాని రామచంద్రరావు, జాయింట్ కార్యదర్శి ముచ్చల శ్రీను, ముగడ శేఖర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఈగల రమణ, ఈగల గోపి, ఒమ్మి గోపీనాథ్, పల్ల శివ, కాకర రాము, ఒమ్మి రాజశేఖర్, ప్రసాది వినోద్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు చొల్లంగి నాగేశ్వరరావు, యూత్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు పల్లా త్రినాథ్, గొలగాని ప్రకాశ్, మీసాల ప్రదీప్, వేణుగోపాలరెడ్డి, సంధ్య పాల్గొన్నారు.


అనుపు మహోత్సవంలో కోలాటం ప్రదర్శన

ఏయూ మోడల్ కెరీర్ సెంటర్‌లో నేడు ఇంటర్వ్యూలు

మద్దిలపాలెం: ఏయూలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో బుధవారం ఉదయం 10:30 గంటల నుంచి పలు సంస్థల్లోని ఉద్యోగ ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మోడల్ కెరీర్ సెంటర్ డిప్యూటీ చీఫ్ దొరబాబు తెలిపారు. స్మార్ట్‌మీటర్ల ఇన్‌స్టలేషన్ రంగంలో 80 ఖాళీలు ఉన్నాయి. ఎలక్ట్రికల్ ఐటీఐ లేదా గ్రాడ్యుయేషన్‌తోపాటు 2 ఏళ్ల అనుభవం ఉన్నవారు, 32 ఏళ్లలోపు వయసు గలవారు అర్హులు. ఎంపికైన వారికి నెలకు రూ.20వేలు వేతనం లభిస్తుంది. ఐఫోన్ మ్యానుఫ్యాక్చరింగ్ విభాగంలో 60 ఖాళీలు ఉన్నాయి. ఇంటర్మీడియట్ అర్హతతోపాటు 26 ఏళ్లలోపు వయసు గలవారు అర్హులు. నెలకు రూ.18,700 వేతనం అందిస్తారు. డి.మార్ట్‌లో 30 ఖాళీలకు ఇంటర్మీడియట్ అర్హతతోపాటు 25 ఏళ్లలోపు వయసు గలవారు అర్హులు. వీరికి నెలకు రూ.11,500 వేతనం ఉంటుంది. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థలో 50 ఖాళీలు అందుబాటులో ఉన్నాయి. 10వ తరగతి అర్హతతో పాటు 50 ఏళ్లలోపు వారు అర్హులు. నెలకు రూ. 16వేలు వేతనం ఇవ్వనున్నారు.

జిల్లా స్థాయి యోగా పోటీలు ప్రారంభం

ఏయూ క్యాంపస్: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి యోగా పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. బీచ్ రోడ్డులోని సాగరిక ఫంక్షన్ హాల్‌లో యోగా అండ్ యూత్– బిల్డింగ్ ఏ హెల్తీ ఫ్యూచర్ అంశంపై పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, హోం మంత్రి వంగలపూడి అనిత, జిల్లా ఇన్‌చార్జి మంత్రి బాల వీరాంజనేయస్వామి తిలకించి యువతను అభినందించారు. డీఈవో ఎస్.ప్రేమ్‌కుమార్, సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ జె.చంద్రశేఖర్ పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీల్లో జిల్లాలోని 11 మండలాల నుంచి 143 మంది తలపడ్డారు. జూనియర్స్ యంగ్, సీనియర్ విభాగాలుగా ఈ పోటీలు జరుగుతున్నాయి. సోలో యోగాసనాలు, సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, ధ్యానం వంటి అంశాలలో పోటీలు నిర్వహించారు. బుధవారం బృంద యోగా, యోగా గీతాలు, చిత్రలేఖనం, పోస్టర్ తయారీ, స్లోగన్, వ్యాసరచన, లఘు చిత్రాలు, ఫొటోగ్రఫీ పోటీలు జరగనున్నాయి.


పోటీల్లో పాల్గొన్న యువతతో మంత్రి లోకేష్

ఏఎంటీజెడ్ ఆధ్వర్యంలో నేడు, రేపు సదస్సు

ఏయూ క్యాంపస్: అనుకూలమైన మౌలిక వసతుల కల్పనపై ఏఎంటీజెడ్ ఆధ్వర్యంలో రెండు రోజుల సదస్సు జరగనుంది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్(ఏఎంటీజెడ్) పర్పుల్ బిల్డింగ్ సర్టిఫికేషన్ స్కీంకి సంబంధించి దేశ వ్యాప్తంగా సలహా సమావేశాన్ని నిర్వహించింది. ఇందులో భాగంగా బుధ, గురువారాల్లో ఏఎంటీజెడ్‌లో నిర్వహించే ఈ సదస్సులో 50 మందికిపైగా నిపుణులు హాజరు కానున్నారు. వీరిలో యాక్సెసబిలిటీ నిపుణులు, దివ్యాంగ హక్కులు, ఆర్కిటెక్చర్ నిపుణులు ఉన్నారు. దివ్యాంగులు, వృద్ధులు, గర్భిణులు, ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తులకు అనుకూలమైన భవనాలను, వ్యవస్థకు తుది రూపం ఇచ్చే దిశగా చర్చించి, నిర్ణయం తీసుకోనున్నారు.

అర్ధరాత్రి విరిగిన చెట్టు కొమ్మ


కొమ్మను తొలగిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది

మద్దిలపాలెం: నగరంలో సోమవారం అర్ధరాత్రి వీచిన గాలులకు హెచ్‌బీ కాలనీలో ఓ చెట్టు కొమ్మ విరిగి పడిపోయింది. ఈ ఘటన రాత్రి పూట జరగడంతో ఎవరికి ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. ఆస్తి నష్టం కూడా సంభవించలేదు. విద్యుత్ సరఫరాకు మాత్రం కాస్త అంతరాయం కలిగింది. విద్యుత్ శాఖ సిబ్బంది సత్వరమే స్పందించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. మంగళవారం శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది హుటాహుటిన రోడ్డుపై పడిన చెట్టు కొమ్మను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

బాల కార్మిక వ్యవస్థ లేని సమాజం అందరి బాధ్యత


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రకాశరావు తదితరులు

ఎంవీపీకాలనీ: బాల కార్మిక వ్యవస్థ లేని సమాజం అందరి బాధ్యత అని బాల వికాస్ ఫౌండేషన్ కార్యదర్శి నరవ ప్రకాశరావు అన్నారు. ప్రపంచ బాల కార్మిక దినోత్సవాన్ని ఎంవీపీ కాలనీలోని వీఎంసీ డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వరరావుతో కలిసి ఆయన 'పని చేయడం పెద్దల వంతు.. బడికి వెళ్లడం పిల్లల వంతు'నినాదంతో రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరవ మాట్లాడుతూ విశాఖ నగరంలో బాల కార్మికులు నిత్యం పెరిగిపోతున్నారన్నారు. బాల కార్మికులను సంరక్షించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని సంకల్పం అందరిలోనూ ఉండాలన్నారు. ఇందుకు ప్రజలతో పాటు ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

పని గంటలు పెంచే బిల్లును ఉపసంహరించుకోవాలి

బీచ్ రోడ్డు: ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల(సవరణ) బిల్–2025 ద్వారా పని దినాన్ని 10 గంటలకు పెంచుతూ చేసిన సవరణను రాష్ట్ర మంత్రివర్గం ఇటీవల ఆమోదం తెలపడాన్ని మానవ హక్కుల వేదిక ఖండిస్తుందని హెచ్‌ఆర్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బిల్ కార్మికుల హక్కుల మీద, ఆత్మగౌరవం మీద దాడిగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సవరణను ప్రభుత్వం ఒక సంస్కరణగా ప్రచారం చేసుకుంటుందని, నిజానికి ఇది ఒక హేయకరమైన వెనకడుగు అని దుయ్యబట్టారు. పని గంటలు పెంచడం అంటే దోపిడీకి మార్గం సుగమం చేయటమేనన్నారు. మానవీయ, సుస్థిర పని విధానాలను పోరాడి సాధించుకున్న కార్మిక ఉద్యమాలను చులకన చేయడమేనని ఆయన విమర్శించారు. కార్పొరేట్ శక్తుల లాభాల కోసం ప్రభుత్వం ఇప్పుడు అటువంటి హక్కులను తిరగదోడే ప్రయత్నం చేస్తుందన్నారు. 8 పని గంటల దినాన్ని వ్యవస్థీకృతం చేయటంలో బీఆర్ అంబేడ్కర్ కీలక పాత్ర వహించిన విషయాన్ని ప్రభుత్వం గుర్తు చేసుకోవాలన్నారు. ఈ సవరణ బిల్ ప్రవేశపెట్టడం ద్వారా ప్రభుత్వ రాజ్యాంగ స్ఫూర్తిని అపహాస్యం చేస్తోందన్నారు. తక్షణమే ఈ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ముగిసిన కిశోరి బాలికల వికాస వేసవి శిబిరాలు

ఆరిలోవ: అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన కిశోరి బాలికల వికాస వేసవి శిబిరాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా పలు అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో ర్యాలీలు చేపట్టి కిశోరి బాలికలకు అవగాహన కల్పించారు. ఆరిలోవ ప్రాంతంలో నెహ్రూనగర్, లక్ష్మీనగర్ అంగన్‌వాడీ కేంద్రాలలో కిశోరి బాలికలకు బాల్య వివాహాల నిర్మూలనపై కార్యకర్తలు పలు సూచనలు చేశారు. ఆయా కేంద్రాలను ఐసీడీఎస్ మద్దిలపాలెం సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సెల్వియా సందర్శించి బాలికలకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయా అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


ఆరిలోవ కాలనీలో బాలికలతో కలసి ర్యాలీ నిర్వహిస్తున్న లక్ష్మీనగర్ అంగన్‌వాడీ కార్యకర్తలు

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ గవర్నమెంట్ రైల్వే పోలీసులు రైల్వేస్టేషన్‌లో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఎస్‌ఐ అబ్దుల్‌మారూఫ్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ సిబ్బందితో రైల్వేస్టేషన్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో కోరాపుట్ నుంచి బెంగళూరుకు గంజాయి రవాణా చేస్తున్న అనిత్‌బాగ్‌ను అదుపులోకి తీసుకున్నారు. రూ.16,500 విలువైన 3.3కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచారు.

యోగా దినోత్సవానికి 25 మంది స్నేక్ క్యాచర్స్

ఆరిలోవ: ఈనెల 21న నిర్వహించనున్న యోగా దినోత్సవానికి 25 మంది స్నేక్ క్యాచర్స్‌ను అటవీశాఖ అధికారులు సిద్ధం చేశారు. వారితో మంగళవారం కంబాలకొండ ఎకో టూరిజం పార్కు క్యాంటీన్‌లో ఫారెస్ట్ రేంజర్ శాస్త్రి సమావేశమయ్యారు. వారి విధులు, ఏయే పాయింట్ల వద్ద ఎవరెవరు ఉండాలో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా దినోత్సవ ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అటవీ శాఖ తరఫున పాములు భయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు బీచ్ రోడ్డులో 28 కిలోమీటర్ల పొడవున ఇరుపక్కలా 85 ప్రాంతాలలో యోగాసనాలు వేస్తారని, ఆ ప్రాంతాలకు సమీపంలో 12 చోట్ల స్నేక్ క్యాచర్స్ అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. వారితో పాటు మరో రెండు మొబైల్ బ్యాచ్‌లు(స్నేక్ క్యాచర్స్) కూడా బైక్‌లపై తిరుగుతాయన్నారు. వారికి ప్రత్యేకంగా ఐడీ కార్డులు అందిస్తామన్నారు. సమావేశంలో సెక్షన్ ఆఫీసరు శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.


కంబాలకొండ పార్కులో స్నేక్ క్యాచర్స్‌తో రేంజర్ శాస్త్రి

పరిశ్రమల రాయితీలు హోటల్ రంగానికి అందించాలి

మంత్రి టీజీ భరత్‌కు వివిధ సంస్థల ప్రతినిధుల వినతి

ఏయూక్యాంపస్: ప్రభుత్వ పరంగా పరిశ్రమలకు కల్పించే రాయితీలను హోటల్ రంగానికి సైతం కల్పించాలని కోరుతూ రాష్ట్ర పరిశ్రమల శాఖమంత్రి టి.జి.భరత్‌కు వివిధ సంస్థల ప్రతినిధులు వినతిపత్రం అందించారు. మంగళవారం బీచ్‌రోడ్డులోని ఒక హోటల్‌లో మంత్రిని ఏపీ చాంబర్స్ పూర్వ అధ్యక్షుడు పైడా కృష్ణప్రసాద్, ఎఫ్ఏపీసీసీఐ అధ్యక్షుడు కంకటాల మల్లిక్, టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు విజయమోహన్, హోటల్స్, రెస్టారెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(హెచ్‌ఆర్‌ఏపీ) అధ్యక్షుడు ఎం.వి.పవన్‌కార్తీక్‌లు కలిశారు. పరిశ్రమలకు అందించే విధానంలో విద్యుత్ చార్జీలు, ప్రాపర్టీ ట్యాక్స్, నీటి సరఫరా చార్జీలు అమలు చేయాలని కోరారు. ఇప్పటికే హోటల్ రంగానికి పారిశ్రామిక హోదా ఇచ్చారని, అదే విధంగా సీఎంతో చర్చించి తగిన రాయితీలు కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.


మంత్రికి వినతిపత్రం అందిస్తున్న పైడా కృష్ణ ప్రసాద్, కంకటాల మల్లిక్, కార్తీక్ తదితరులు